# ఖాళీలు

రిటైర్‌మెంట్ వరకూ తిరుగులేకుండా చేస్తాడనుకున్న ఉద్యోగం... మరో అయిదు సంవత్సరాలు సర్వీస్ వుండగానే అర్థాంతరంగా వదులుకున్నాడు సీతారామ్. ఉద్యోగం వదులుకోవడానికి కారణం అనారోగ్యం కాదు. అయిష్టత కాదు. కొడుకు ఆదేశం. బెంగుళూరు నుంచి ఒక ఫోన్‌కాల్.

ఆ క్షణంవరకూ ఇంటి యాజమాన్యం తన చేతుల్లోనే ఉందనుకున్నాడు సీతారామ్. ఈ ట్రాన్స్‌మిషన్ ఆఫ్ పవర్ అనూహ్యంగా, హఠాత్తుగా కొడుకు ఆదిత్య చేతుల్లోకి వెళ్ళిపోయినందుకు విస్తుపోయేడు. విస్మయం చెందేడు. అయితే బాధపడలేదు.

మరోవైపు కొడుకు నిర్ణయాన్ని సపోర్టు చేసి తనపై ఒత్తిడి పెంచిన భార్య సరోజ.

నిజానికి, అసలు ఒత్తిడిమాత్రం కంపెనీ యాజమాన్యందే. తను పనిచేస్తున్న ప్రభుత్వరంగ సంస్థని ప్రైవేటీకరించే పకడ్బందీ ప్రణాళిక...అందులో ఒక భాగంగా, ముందుగా వీలైనంతమంది ఉద్యోగులను తొలగించుట. అందుకు అస్త్రం వీ.ఆర్.ఎస్.

ఆర్థిక ప్రపంచీకరణ వల్ల తన కుటుంబంలో మంచీ జరిగింది, చెడూ జరిగింది అనుకున్నాడు. చెడు ఏమిటంటే తన ఉద్యోగం అర్థాంతరంగా పోవడం. మంచి ఏమిటంటే ఒక బహుళజాతి కంపెనీ తన కొడుక్కి లక్షరూపాయల జీతం ఇచ్చి నిలబెట్టడం.

ఆదిత్య ఇంజినీరింగ్ చదివి, కెరీర్ ఆరంభంలోనే లక్షరూపాయల జీతగాడు అవుతాడని ఊహించలేదు సీతారామ్. అదే సమయంలో, ముప్ఫయి సంవత్సరాల సర్వీస్ చేసిన తండ్రి జీతం ముప్ఫయివేలు మాత్రమేనని ఊహించలేకపోయేడు

ఆదిత్య. తండ్రి జీతం తనకు ఇంతవరకూ తెలీదు.

తండ్రి వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల ఎంత సొమ్ము వస్తుందనే లెక్కల్లో తండ్రి జీతం ఎంతో తెల్సింది. తెలియగానే దిగ్భ్రాంతి చెందేడు. అంతే కాదు ఆదిత్యకు నవ్వు తన్నుకువచ్చి విరగబడి నవ్వేడు. తనూ ఇంజినీరే. తండ్రీ ఇంజినీరే.

ఊడిపోయిన ఉద్యోగంకన్నా, కొడుకు నవ్విన నవ్వే సీతారామ్‌ని గాయపరచింది. గుండెల్లో గుచ్చుకుంది.

తను అసిస్టెంట్ ఇంజినీర్‌గా ప్రభుత్వరంగ సంస్థలో జాయిన్ అయినప్పుడు జీతం కేవలం మూడు వందల యాభై రూపాయలే.

జీతం తక్కువ. జీవితంలో సమస్యలు ఎక్కువ. సమస్యలతో పోరాడేడు తప్ప తన జీతాన్ని చూసి కుంగిపోలేదు. ఆ జీతమే ఒక విధంగా తనలో చైతన్యాన్ని నింపి జీవితాన్ని ముందుకు నడిపించింది.

ఆ జీతపురాళ్ళతోనే తన తల్లిదండ్రులకు కొంత ఓదార్పునిచ్చేడు. చెల్లెళ్ళు ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసేడు. అంతేకాదు నెలనెలా లోన్ తీరుస్తూ, ఒక విశాలమైన ఇల్లుని స్వంతం చేసుకున్నాడు.

"ఒరే. ఆ జీతంతోనే నీకు ఖరీదైన బొమ్మలు, దుస్తులు, ఒకటేమిటి ఏది కావలిస్తే అది కొని ఇచ్చింది. నీ సినిమాలు, షికార్లు వదిలేయ్. నీకు ఈ ఉద్యోగం సంపాదించిపెట్టిన ఇంజినీరింగ్ చదువు బెంగళూరు కాలేజీలో కొన్నది ఈ జీతంతోనే. అవునా? ఇంత జీవితాన్ని, జీవితానికి భద్రతని ఇచ్చిన నా జీతాన్ని తలచుకుని ఎలా నవ్వగలిగేవురా?

ఇంతటి తృప్తి నీ లక్షల జీతం ఇవ్వగలదా? ఒరే జీవితం అంటే డబ్బు కాదురా. అది ముందు తెల్సుకోరా" అని ఒక ఉద్వేగంతో సీతారామ్ స్పందిస్తే- ఆదిత్య క్షమాపణలు చెప్పి తండ్రిని చల్లబరిచేడు.

"ఏదో వాడు తెలియక ఒక వెర్రినవ్వు నవ్వితే... వాడిపై మీరు అంతగా సీరియస్ అయిపోయి దాడి చేయాలా? మీరు అన్న మాటలకి కొడుకు ఎంత బాధపడ్డాడో" అని బాధపడిపోయింది సరోజ.

భార్య అన్నది కూడా పాయింటే అనిపించింది సీతారామ్‌కి. అయినా కొడుకు విరగబడి సంపాదిస్తుండటంతో మొగుడు పార్టీనుంచి కొడుకు పార్టీకి ఆమె మారిపోయిందన్నది అతడు గమనించిన విషయం.

సరోజ డిగ్రీ చేసినా, ఉద్యోగాలు ఏలకుండా హౌస్ వైఫ్‌గా తన బాధ్యతలు నిర్వహించి, భర్తకు ఎంతగానో సహకరించింది. ఒక ప్రణాళికాబద్ధంగా సంసారాన్ని

తీర్చిదిద్దింది. ఆదిత్య అంటే ఆమెకు ప్రాణం. అలాగే ఆదిత్యకు కూడా తల్లి సరోజ అంటే ప్రాణం. ఇద్దరూ గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుకుంటారు.

సీతారామ్ రెండు, మూడు నిమిషాలకన్నా ఎక్కువ మాట్లాడలేడు. మాట్లాడడానికి ఏమీ కనబడదు.

సరోజకి కొడుకు అంటే ఎంత ఇష్టమో బంగారం అంటే అంత ఇష్టం. కొడుకు సంపాదించడం మొదలు పెట్టినప్పటినుంచీ ప్రతి ఏడాదీ వరలక్ష్మీ వ్రతానికి కనీసం మూడుతులాల బంగారం కొంటాడు.

ఆమెకు ఇపుడు మొగుడు మాటలు, చేష్టలూ చాదస్తంగా కన్పిస్తున్నాయి. కొడుక్కి ఫోన్‌లో తనపై చాడీలు, ఆరోపణలు. ఒకరకంగా సరోజే కొడుకుని తమ కుటుంబానికి యజమానిగా చేసేసిందని సీతారామ్ భావన. అయితే అధికారం తన చేతుల నుంచి చేజారిపోయిందని చింతించడంలేదు.

ఆ దంపతులకి ఆదిత్య ఒక్కడే కొడుకు. కూతురు పుట్టి మూడవ ఏటే ఏదో జబ్బుచేసి చనిపోయింది. జీవితంలో ఆ లోటు, ఆ ఖాళీ ఎప్పటికీ పూరింపబడనిది. పోయిన కూతురు గుర్తుకొచ్చి ఇప్పటికీ ఏడుస్తుంది సరోజ. కొడుకుని ఎంతో అపురూపంగా, అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు. ఆదిత్యకు ఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ రాలేదు. డబ్బుపోసి, బెంగళూరులో ఇంజనీరింగ్ చదివించేరు. చదువు అయిన వెంటనే ఉద్యోగం కూడా అక్కడే వచ్చింది.

ఈ మధ్యనే ప్రేమ వివాహం చేసుకున్నాడు. బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న అమ్మాయే. ఐతే తెలుగు అమ్మాయి కాదు. పంజాబీ పిల్ల. పేరు అమృత. ఆధునికంగా, అందంగా ఉంటుంది. వాళ్ళ ప్రేమ వివాహానికి సీతారామ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేడు.

కాని సరోజ గొడవ చేసింది. తన ముద్దుల కొడుక్కి మంచి కోడలిని తనే ఎంపిక చేద్దామనుకుంది. ఆదిత్య ఆమెకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఏడ్చింది ఎంతగానో.

ఆదిత్య తల్లిని వదల్లేదు. ఆమె ఒడిలో చంటిబిడ్డలా ఏడ్చి... నెమ్మదిగా ప్రసన్నం చేసుకున్నాడు. చివరికి సరోజ హృదయపూర్వకంగా వాళ్ళ వివాహానికి ఒప్పుకుంది. ఘనంగా జరిపించింది.

ఆదిత్య జీవితంలో అమృత ప్రవేశించినా... వాడి గుండెల్లో అమ్మస్థానం పదిలం, ఉన్నతం అని ఆమె ప్రగాఢ నమ్మకం. సీతారామ్ విశ్రాంతి ఉద్యోగి అవతారం ఎత్తేక అతనికి బెంగళూరు ఆహ్వానం!

"మనమంతా కలిసివుందాం. హాయిగా ఉందాం. మా దగ్గరకి అమ్మా, మీరు వచ్చేయండి" అంటూ మనస్ఫూర్తిగా పిలిచేడు. అందరం కలసివుందామని నిజంగానే కోరుకున్నాడు ఆదిత్య.

కొడుకు ఆహ్వానాన్ని తల్లి ఆహ్లాదంతో ఒప్పుకుంది. తండ్రి ఏమాత్రం ఒప్పుకోలేదు.

అయితే తండ్రి ఎంత నచ్చచెప్పినా ఆదిత్య వినిపించుకోలేదు. తన మాటమీదే నిలబడిపోయేడు.

మరోవైపు భర్త నిర్ణయానికి... భార్యగా వివేచనతో, వివేకంతో, సంస్కారంతో భర్తకు సపోర్టు ఇవ్వకుండా కొడుకు పక్కనే నిలబడింది. భర్తను పోరింది. సతాయించింది. ఆమె ప్రపంచమంతా కొడుకే. ఆదిత్య తనను విడిచివుండలేకే, అమ్మకోసమే... తమ ఇద్దరినీ వచ్చేయమంటున్నాడని ఆమె భావన.

చివరికి సీతారామ్ ఓడిపోయేడు. అయిష్టంగా ఉద్యోగం వదులుకున్న రీతిలోనే, అయిష్టంగా బెంగళూరు నివాసానికి సిద్ధమయ్యేడు.

సీతారామ్‌కి తనపైన తనకే పరమ చిరాకు. తన జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే... తను ఇష్టంలేని పనులు ఎన్నెన్నో చేసేడు.

అవన్నీ ఎవరికోసం చేసేడో, ఎందుకోసం చేసేడో స్పష్టంగా చెప్పలేడు. దృఢచిత్తం లేకపోవడం కాదు. అసమర్థత, అవగాహనారాహిత్యం కాదు.

కుటుంబపరంగా, సామాజికంగా బందీ అయిన మనిషి వైయక్తికంగా తన పనులు అన్నీ తను కోరుకున్నవిధంగా చేసుకోవడం సాధ్యపడదేమో. జీవితంలో అసంతృప్తి గదులూ, ఖాళీలు తప్పవేమో... ఆవిధంగా సాగుతాయి అతని ఆలోచనలు.

ఒక గదిలో ఇంటిసామాను అంతా బంధించి, ఇల్లుని ఒక మిత్రుడికి అప్పగించి, అద్దెకిచ్చి జీవితంలో కొత్త మజిలీకి సమాయత్తమయ్యేడు సీతారామ్.

***

పనిదినాల్లో ప్రయాణమై కొడుక్కి ఇబ్బంది కలిగించకుండా ఆదివారం నాడే బెంగళూరులో రైలు దిగేవిధంగా ప్లాన్ చేసుకుని ప్లాట్‌ఫారమ్ మీదకు దిగేరు ఆదిత్య తల్లిదండ్రులు.

స్టేషన్‌కి ఆదిత్యతో పాటు అమృత కూడా వచ్చింది. రైలు దిగిన అత్తమామల కాళ్ళకు నమస్కరించింది.

దాంతో సరోజ చుక్కల్లో విహరించడం సీతారామ్ గమనించకపోలేదు.

ఆదిత్య ఇల్లు అద్దె ఇల్లు అయినప్పటికీ విశాలంగా ఉంది. తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఏ.సి. గది ఏర్పాటు చేసేదు ఆదిత్య.

కొత్త ప్లేస్‌లో, కొత్త వాతావరణంలో కొడుకు, కోడళ్ళతో కలసి జీవించ బోవడం థ్రిల్‌గా తోచింది సీతారామ్‌కి. కొడుకు వద్దకు వచ్చేయడంతో, మరిక మొగుడు సరోజకి కనబడదు అనుకున్నాడు సీతారామ్. కాని చిత్రంగా మొగుడుకి, తొలిరోజుల్లో వలే, మరింత చేరువ అయింది సరోజ. ఆదివారం బెంగళూరులో దిగిన సరోజమ్మకు సోమవారం ఉదయమే భంగపాటు.

సరోజకు, సీతారామ్‌కు ఉదయం అయిదు, ఆరు గంటల మధ్య లేవడం అలవాటు. సోమవారం ఉదయం కూడా అలానే లేచారు. కొడుకు, కోడలు లేవలేదు. వాళ్ళ బెడ్‌రూమ్ తలుపులు తెరుచుకోలేదు.

ఉదయం లేచి, ఇంటిపనులలోకి దిగేముందు, టీ నీళ్ళు తాగడం అలవాటు. సమయం పావుతక్కువ ఎనిమిది అవుతున్నా కొడుకూ, కోడలు జాడలేదు.

వంటగదిలోకి వెళ్ళి టీ చేసుకుని తాగడానికి సాహసించలేకపోయింది సరోజ.

మొగుడివైపు దీనంగా చూసింది. ఆమెకు ధైర్యం చెప్పి వంటగదిలోకి తీసుకువెళ్ళేడు. స్టవ్ కొత్తరకంగా ఉంది. ఎలా వెలిగించాలో తెలీదు. ఏ వస్తువు ఎక్కడ వుందో తెలియదు. డబ్బాలు వెదకడం ఏదో తప్పుడు పనిలా తోచి, వంటగదిలోంచి హాలులోకి వచ్చేసి, సోఫా మీద కూలబడి కన్నీరు కార్చేసింది.

సీతారామ్ ఆమెనలా చూడలేక బయటకువెళ్ళి, రోడ్లంబటపడి టీ తీసుకువద్దమనుకున్నాడు.

అంతలో కాలింగ్‌బెల్ మోగింది.

తలుపులు తీస్తే ఎదురుగా పనిపిల్ల.

ఆ కాలింగ్‌బెల్‌ను అలారంగా భావించి, ఆదిత్య లేచి వచ్చి ప్రత్యక్షమయ్యాడు.

సరోజకు ప్రాణం లేచివచ్చింది.

"ఒరే నాయినా. ఏమిట్రా మాకీ శిక్ష. టీనీళ్ళు లేవా" అని అడిగింది.

"అమ్మా. నీవు గెస్టువి కావు. నీ టీనీళ్ళు నీవే కాచుకొని తాగాలి" అన్నాడు ఆదిత్య.

వంటగదిలో తను చేసిన విఫలయత్నం కూడా చెప్పింది. ఆదిత్య తల్లిని వంటగదిలోకి తీసుకువెళ్ళి స్టవ్ వెలిగించే విధానంతోపాటు డబ్బాలన్నిటినీ పరిచయం చేశాడు. వెంటనే ఆదిత్యే టీ కాచి పనిపిల్లతో సహా అందరికీ ఇచ్చేడు. కోడలు చేయాల్సిన పని కొడుకు చేయడాన్ని చిత్రంగా చూసింది. మహాతల్లి

ఇంకా మంచం దిగలేదులా వుంది.

సరోజ టీ తాగుతూ... "ఒరే. ఏమిట్రా మీ వెధవ నిద్రలు, ఇంటికి దరిద్రంరా" అంది.

"అమ్మా! నీకు దరిద్రం. మాకు సుఖం. నా ప్రార్ధన ఏమిటంటే నీ అలవాట్లను మాకు నేర్పే ప్రయత్నం చేయకు. అంతేకాదు. ఇక్కడ పరిస్థితులకు అనుగుణంగా నీవు మారిపోవాలి. తప్పదు" అని ఆదిత్య నవ్వుతూ, నెమ్మదిగా చెప్పినా, అందులో ఆదేశం ఉంది. బిత్తరపోయింది తల్లి.

"మీకోసం నా అలవాట్లను మార్చుకోలేనురా" అంటూ తనూ స్పష్టం చేసింది.

ఆదిత్య తగ్గేడు.

"ఎవరి అలవాట్లు వాళ్ళవి. ఎదుటివాళ్ళని ఇబ్బంది కలిగించకుండా వుంటే చాలు"

"సరే. టిఫిన్ టైమ్ అయింది కదా. పిండిలూ, రుబ్బులూ చూపిస్తే... ఏమిటి చేయమంటే అది చేస్తాను"

"అమ్మా! నీకా శ్రమ అక్కరలేదు. కాసేపటిలో హోటల్ నుంచి వేడివేడి టిఫిన్లు వచ్చేస్తాయి" అంటూ తిండివిషయమై కొన్ని విషయాలు చెప్పేడు ఆదిత్య.

తనకీ, అమృతకీ వంటలు చేయడం బ్రహ్మాండంగా వచ్చినప్పటికీ, తీరిక లేని ఉద్యోగాల వల్ల, సమయం దొరికినా అలసటవల్ల, బద్ధకంవల్ల సోమవారం నుంచి శనివారం వరకు ఇంట్లో వండుకుని తినరు.

హోటల్ నుంచి తిండి ఇంటికి రావడమో లేక హోటల్‌లోనే తినేసిరావడమో వాళ్ళ దినచర్య. ఆదివారం మాత్రం మూడ్ ఉంటే సరదాగా మొగుడూ పెళ్ళాలు ఇద్దరూ కలసి కావల్సింది వండుకుని లంచ్ ఎంజాయ్ చేస్తారు. రాత్రికి మళ్ళీ రెస్టారెంటే. బుగ్గలు నొక్కుకుంది సరోజ. వారానికి ఒకపూట హోటల్ తిండి అంటే అర్థముందిగాని... వారం అంతా హోటల్‌పై పడి, ఒకపూట ఇంట్లో వండుకోవడం ఏమిటీ

"ఇదేం బాగులేదురా. నేను వచ్చేశాను కదా. ఇక ఇంట్లోనే వండుకుతిందాం"

ఆదిత్యలో చిరాకు – "అమ్మా చెప్పానుగా ఇక్కడి పద్ధతులకి మీరు అలవాటుపడాలి"

"మీరు ఎలా తింటారో తినండి. నేను, మీనాన్న ఇంట్లోనే వండుకుతింటాం. ఒరే నువ్వు ఇంటికొచ్చినప్పుడల్లా నీకు ఇష్టమైన వంటలు నాతో చేయించుకుని

తినేవాడివి. అవునా. ఎంచక్కా అలా తినొచ్చుకదా"

"సరే. ఆ విషయం తరువాత ఆలోచిద్దాం. నాకు డ్యూటీ టైమయిపోతోంది. వస్తాను" అని హడావిడిగా పరిగెట్టేడు ఆదిత్య.

'తర్వాత ఆలోచించడం అంటే పెళ్ళాంతో ఆలోచించడం అన్నమాట. తను ఒక్కడూ ఏ ఖాళీలు పూర్తి చేయలేదు' అనుకున్నాడు సీతారామ్ నవ్వుతూ.

ఆదిత్య గబగబా తయారైవచ్చి 'వస్తానమ్మా' అని చెప్పి తన కారులో వెళ్ళిపోయేడు.

ఇంకా తెల్లవారలేదు కోడలు పిల్లకి.

"ఏమిటండీ, మొగుడు ఆఫీసుకి వెళ్తుంటే, పెళ్లాం అనేది మొగుడుకి అన్నీ సమకూర్చి, ద్వారం దాకా వెళ్ళి సాగనంపే సంస్కారం లేదా. ఇదేం సంసారం?" నుదురు కొట్టుకుంది సరోజ.

నవ్వేశాడు సీతారామ్.

"పోనీ ఇద్దరూ ముచ్చటగా ఒకేసారి తయారై వెళ్ళొచ్చు కదా" అంది సరోజ.

"వెళ్ళరు. ఇద్దరు కంపెనీలు వేర్వేరు. ఇద్దరి టైమింగ్స్ వేర్వేరు. ఇద్దరి కార్లు వేర్వేరు"

మూతి మూడువంకలు తిప్పింది సరోజ.

మరికాసేపటిలో తలుపులు తెరుచుకునివస్తున్న అమృతను చూసి "దొరసాని దిగుతోందండి" అంది సరోజ మొగుడుతో. ఒకవేళ కోడలుకి వినబడినా, ఆమెకు తెలుగు రాదనే ధైర్యం.

అత్తమామలకు సంస్కారయుతంగా గుడ్‌మార్నింగ్ చెప్పింది అమృత.

అయితే కాఫీలు తాగేరా అని మర్యాదకి కూడా ఆమె అడగలేదు. తనుమాత్రం ఫిల్టర్ కాఫీ చేసుకుని కాఫీ కప్పుతో తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆమె కావాలని చేయలేదు. అడగకపోతే ఆదిత్యకి కూడా కాఫీ ఇవ్వదు. అది ఆమె పద్ధతి.

తర్వాత గబగబా తయారై తన కారులో ఆఫీసుకి వెళ్ళిపోయింది అమృత. అక్కడ ఇంటి వాతావరణంలో, మనుషుల పోకడలో, ప్రవర్తనలో ఖాళీలు ఏవేవో సీతారామ్‌ని కలవరపెట్టాయి.

***

మొత్తానికి వంట విషయంలో సరోజ మాట చెల్లింది. దగ్గరలోనే బజారు వుండటంతో వంటకు కావాల్సినవన్నీ సీతారామ్ తెస్తాడు. సరోజ వండుతుంది.

వండింది తింటుంది. మొగుడికి పెడుతుంది.

కొడుకూ అప్పుడప్పుడు తింటూ అలవాటుపడుతున్నాడు. కోడలు పిల్ల మాత్రం తినదు. అసహ్యంకాదు. టెక్కుకాదు. ఎక్కదు అంతే. ఆమె టేస్టులు వేరు. పంజాబీ భోజనం, గోవా వంటకాలు, చైనా డిష్‌లూ అత్త చేయగలిగితే తినడానికి కోడలికి అభ్యంతరం లేదు.

మొదట బెట్టుచేసిన ఆదిత్య, ఇప్పుడు పూర్తిగా తల్లి వంటల్ని ఎంజాయ్ చేస్తున్నాడు.

ఇష్టమైన కూరలూ, ఇష్టమైన టిఫిన్లు, ఇష్టమైన స్వీట్లు తల్లితో చేయించుకుని తృప్తిగా తింటున్నాడు. తను చేసింది కొడుకు తింటుంటే ఒక తీయని అనుభూతితో, తన్మయభావనతో మురిసిపోతున్నది సరోజ.

ఆదివారం వంట పూర్తిగా అమృత చేస్తుంది. 'నా వంట ఎలా ఉంది అత్తగారూ' అని కోడలు అడిగితే. నచ్చకపోయినా 'బాగుంది' అంటుంది. మొగమాటం. కోడలికి లేని మొగమాటం అత్తకు ఏల?

***

సరోజకి దేవాలయాలు ఇష్టం. అమృతకు పబ్స్, మాల్స్ ఇష్టం. ఆమె వారం వారం పరుగులు తీస్తుంది. ఆదివారం మాల్స్‌కే ప్రత్యేకం.

షాపింగ్‌మాల్‌కి ఏదో ఒక గంట వెళ్ళివచ్చేయడం కాదు. సాయంత్రం ఏ మూడు, నాలుగ్గంటలకో ఒక అద్భుత ప్రపంచంలోకి ప్రవేశించి... రాత్రి ఏ ఎనిమిది గంటలకో తృప్తిగా, నిండుగా బయటకు రావడం.

అమృత, ఆదిత్య కలిసే షాపింగ్ చేస్తారు. అదొక సందడి, సరదా. పల్లెటూళ్ళ లో పరసలాగ, తీర్థంలాగ, ఉత్సాహంగా తిరిగేస్తారు. అయితే తీర్థాలు ఏడాదికి ఏ ఒక్కరోజో వస్తాయి. మాల్స్ ఒక్కరోజు విరామం లేకుండా ఏడాది పొడుగునా కళకళలాడుతూ కస్టమర్స్‌ని ఆకర్షించి లోపలికి లాగేస్తాయి.

షాపింగ్ అవసరమయి కావాల్సిన వస్తువులు కొనడానికి వెళ్ళదు అమృత. అవసరాలతో సంబంధంలేకుండా ఏదిపడితే అది నచ్చినవన్నీ కొనేస్తుంది. చేతిలో రెడీగా డబ్బు అక్కరలేదు. క్రెడిట్ కార్డుతో అప్పులు చేసైనా కొనేయవచ్చు. ఇంట్లో ఏఏ వస్తువులు ఉన్నాయో, ఎన్నెన్ని దుస్తులు ఉన్నాయో ఆమెకే తెలీదు. ఆమె జీతంలో ఎక్కువశాతం షాపింగ్‌లకే సరిపోతున్నదేమో.

ఒకరోజు ఉండబట్టలేక అడిగేసింది సరోజ – "పదే పదే ఈ షాపింగ్‌లు ఏమిటి తల్లీ" అని.

"షాపింగ్ నా హాబీ అత్తగారూ" అని కూల్‌గా తెలియజేసింది అమృత.

తెల్లబోయింది సరోజ. షాపింగ్ ఒక హాబీయా! ఎక్కడకెళ్తున్నాం మనం? ఎటు పయనిస్తున్నాం? అంటూ భర్తముందు బాధపడింది సరోజ.

"అవును షాపింగ్ ఒక హాబీయే అయిపోయింది. మన కోడలే కాదు... మెజారిటీ యువతరం అలానే ఉన్నారు. ఈ తరం పిల్లలకి కిరాణాకొట్టుకెళ్ళడం నామోషి. చిన్నచిన్న షాపులకెళ్ళడం చిన్నతనం. చిన్న వస్తువైనా స్టైల్‌గా తయారై మాల్స్‌కే వెళ్ళి కొంటారు.

ఐ.టిలో సంపాదించిన సొమ్ము ఇలా వీటిలో లూటీ అయిపోతోంది. అదే ప్రపంచీకరణ మహత్యం. విలువలు లుప్తమై, జీవితంలో ఏర్పడ్డ ఖాళీలను వస్తు సంబంధమైన సుఖాలతో పూరించి అదే జీవితం అని భ్రమపడుతున్నది నేటి తరం. తెల్లబోయి చూడటమేతప్ప మనం ఏమీ చేయలేం" అన్నాడు సీతారామ్.

***

ఒకరోజు రాత్రి కోడల్ని నిలబెట్టేసింది సరోజ –

"అమ్మా! మీరిద్దరూ ఉదయం వెళ్ళిపోయి ఏ రాత్రో వస్తున్నారు. ఇంట్లో బోర్ కొడుతోంది. ఒక మనవడినో, మనవరాలినో మాకు తొందరగా ఇచ్చేయకూడదూ"

అర్థంకాక అమృత ఆదిత్య వైపు చూస్తే, అతడు ఇంగ్లీషులో అనువదించేడు –

"పిల్లలతో కాలక్షేపం ఏంటండీ. నాన్సెన్స్. మీ ప్రాణాలు, మా ప్రాణాలు తోడేస్తారు పిడుగులు. బోర్ కొట్టకుండా వుండటానికి ఈ మహానగరంలో బోల్డు కాలక్షేపాలు ఉన్నాయి. ఇంట్లో టీవీ ఉంది. డి.వి.డి ఉంది. వాటితో టైమ్ పాస్ చేయండి. దయచేసి మమ్మల్ని లైఫ్ కాస్త ఎంజాయ్ చేయనీయండి" అంది అమృత.

అనువదించకుండానే అర్థమైపోయింది సరోజకు బాగానే. తన పౌత్రోత్సాహంపై నీళ్ళు జల్లి, ఆ ఖాళీని భర్తీ చేయననడంతో హతాశురాలైంది.

ఒళ్ళు భగభగ మండిపోయింది. అయితే ఆ భగభగలు స్పాట్‌లో కోడలుపై చూపించలేదు. ఆమెకు ఔట్‌లెట్‌మొగుడు సన్నిధే కావడంతో, రాత్రి పడుకునే ముందు తన బాధను వెళ్ళగక్కింది.

"అది పిల్లల్ని ఎందుకు కంటాది. దానికి షోకులు, పబ్‌లు, మాల్స్ షాపింగ్‌లు కావాలిగాని పిల్లలెందుకూ? అమ్మో! కడుపొస్తే ఒంపులూ, సొంపులూ పోవూ! నునుపూ, మెరుపూ మాసిపోవూ!

ఏవండీ. నాకు ఒక అనుమానం పీడిస్తోంది. అసలు కొడుకూ, కోడలూ కలుస్తున్నారా? ఏం కలుస్తారు? ఉద్యోగాల ఒత్తిడిలో ఉక్కిరిబిక్కిరై సగం చచ్చి ఇంటికి వస్తున్నారు. ఆ ఒత్తిడిని కూడా ఇంటికి తీసుకువస్తున్నారు. ఇక సాన్నిహిత్యానికి, సాంగత్యానికి సమయం ఎక్కడ? వాళ్ళ ఒంట్లో ఓపికనంతా వాళ్ళ ఉద్యోగాలే పిండుకు తినేస్తే, ఇక కోరికలు ఏం కలుగుతాయి. ఏం రగులుతాయి.

అయినా వాళ్ళకు పిల్లలు ఎందుకులెండి. ఒడిలో లాప్‌టాప్. చెవిలో సెల్‌ఫోన్ చాలు. అవే వాళ్ళ పిల్లలు. అదేమి అన్నదో చూసేరా దాని ఎంజాయ్‌మెంట్‌కి పుట్టే పిల్లలు అడ్డట. రెండురోజులు పోతే మనం కూడా అడ్డుగా కన్పిస్తామేమో.

మనం ఇక్కడ ఉండొద్దండీ. మనింటికి వెళ్ళిపోదాం" అంటూ భర్త గుండెలపై పడి ఏడ్చేసింది సరోజ.

సీతారామ్ ఆమెను మరింత దగ్గరకు తీసుకుని శాంతింపజేశాడు. నిజమే. తను అన్నట్లు లాప్‌టాప్, సెల్‌లే వాళ్ళ పిల్లలు. తాము బెంగళూరు వచ్చి ఏడాది దాటింది. అంతా కలసివుందామని బలవంతంగా రప్పించాడు కొడుకు. ఎక్కడ కలసివున్నారు? మనసు విప్పి ఏం మాట్లాడుకున్నారు?

కనీసం ఇంట్లో ఉన్నప్పుడు ఆదిత్య తల్లిదండ్రులతో గడిపిన సమయంకన్నా లాప్‌టాప్, సెల్స్‌తో గడిపిన సమయమే ఎక్కువ. అందులో సందేహం లేదు.

అంటే తల్లిదండ్రులను కావాలని పక్కన పెట్టేయడం కాదు. వాడి జీవిత విధానాన్ని విమర్శించలేం. మార్చలేం. మనమే మారి వాళ్ళతో ఇమిడిపోవాలి లేదా వెనక్కి వెళ్ళిపోవాలి. వెనక్కి వెళ్ళిపోవడానికి సరోజ సిద్ధపడుతోంది. బెంగుళూరు వచ్చేవరకూ పోరింది. ఇప్పుడు వెళ్ళిపోదామని పోరుతుందేమో.

***

ఒకరోజు ఆదిత్య తల్లిదండ్రుల వద్దకు వచ్చి "అమెరికా వెళ్తున్నాను. ఆశీర్వదించండి" అన్నాడు. అనకాపల్లి వెళ్తున్నాను అన్నంత సుళువుగా తెలియజేశాడు.

దిగ్భ్రమ చెందేరు తల్లిదండ్రులు. "ఇంత సడన్‌గా ఏమిటిది? కంపెనీ పనిమీద వెళ్తున్నావా?"

"లేదు. కొత్త కంపెనీ. కొత్త ఉద్యోగం. మంచి జీతం. ఇలాంటి గోల్డెన్ ఆపర్ట్యూనిటీ అందరికీ రాదు" తనని చూసి గర్వించండి అన్నట్లు మాట్లాడేడు.

"సంతోషం నాయనా" అని అంటూనే -

"మమ్మల్ని బెంగళూరు బలవంతంగా రప్పించి, ఇపుడు నువ్వే బెంగుళూరు

వదలి అమెరికా వెళ్ళిపోతానంటున్నావేమిటీ?" అంది సరోజ.

"అమ్మా! నిజమే. మనమంతా కలసివుందామని మనస్ఫూర్తిగానే పిలిచాను. కాని ఐయామ్ హెల్ప్‌లెస్ అమ్మా. నా కళ్ళముందు ఈ పోటీ ప్రపంచంలో అంతా శరవేగంతో పరిగెడుతున్నారు. చూస్తూ ఎలా ఊర్కోగలను? నేనూ పరిగెట్టాను. ఫస్ట్‌క్లాస్ ఫలం అందుకున్నాను. మిమ్మల్నే కాదమ్మా, కొంతకాలం అమృతను కూడా విడిచివెళ్తున్నాను"

దీనికి వెంటనే సరోజ రియాక్ట్ అయింది. "మొగుడి సుఖం కోసం బిడ్డల్నే త్యాగం చేసేసినట్టు మాట్లాడింది మీ ఆవిడ. ఇప్పుడు నీవులేకుండా ఎలా వుంటుంది?"

"మేమిద్దరం కలసి తీసుకున్న నిర్ణయమే ఇది. అమృత రెండు, మూడేళ్ళలో వచ్చేస్తుంది అమెరికా"

"రెండు మూడు రోజులన్నట్టు చెబుతున్నావురా... సరే నాయనా. మేము కూడా సర్దుకుని బయల్దేరుతాం"

"ఎక్కడికి?"

"ఎక్కడనుంచి వచ్చేమో అక్కడికి"

మాట్లాడలేదు ఆదిత్య.

"కోడల్ని ఒంటరిగా వదలి... మేము వెళ్ళడం బాగోదనా" అడిగేడు సీతారామ్.

"అబ్బెబ్బే. అలాంటి భయం నాకు లేదు. ఆమెకూ లేదు. షికెన్ లివ్ ఆన్ హెర్ ఓన్ విత్‌ఔట్ ఎనీ ప్రాబ్లెమ్" అన్నాడు ఆదిత్య.

"అవునురా, మీ గురించి మేం భయపడాలిగాని... మీరెందుకు భయపడ తారు" అంది.

"మిమ్మల్ని వదలివెళ్ళడం... నాకు చాలా గిల్టీగా ఉందమ్మా. తట్టుకోలేక పోతున్నాను కాని ఏంచేయడం? నా జీవితం నా చేతుల్లో లేదనిపిస్తోంది. కాని అమ్మా, నేను ఎక్కడున్నా మీకు నెలనెలా వెయ్యి డాలర్లు పంపిస్తాను" అని ధైర్యం చెప్పేడు ఆదిత్య.

కొడుకు ముఖం ఆ క్షణంలో సరోజకు డాలర్‌లా కన్పించింది. సీతారామ్‌కి ఆ ముఖం ఒక శూన్యంలా, ఖాళీగా, మెడపై తల లేకుండా కన్పించింది.

ఈ వీస్తున్న ఆర్థిక ప్రపంచీకరణ గాలి దుమారం వల్ల సీతారామ్ తన ఉద్యోగం పోయి చెడు జరిగిందనుకున్నాడు. అయితే ఆ గాలే కొడుక్కి లక్షల్లో

జీతం ఇచ్చి మంచి చేసిందనుకున్నాడు.

కాని ఇప్పుడు ఆలోచిస్తే ఆ 'మంచి' అనుకున్నది నిజంగా మంచేనా అని తనని కలవరపెడుతోంది.

"మాకు కావాల్సింది డాలర్లు కాదు. ప్రేమానురాగాలు. నువ్వు నిలపాల్సింది మానవసంబంధాలు. కనీసం నీవు వారంవారం ఆత్మీయంగా ఫోన్ చేస్తే... ఏదో కొంత నువ్వు మాతోనే ఉన్నట్టు అనుభూతి కలుగుతుందేమోరా" అన్నాడు బరువైన హృదయంతో సీతారామ్.

"అయ్యో! అదేమిటీ. ఫోన్ చేయకుండా ఎలా వుంటాను? మీరెలా వున్నార నేది నాకు కావాలి. తెలియాలి. వారం, వారం కాదు. వారానికి రెండు మూడుసార్లు చేస్తాను ఫోను" అన్నాడు ఆదిత్య.

తర్వాత, తల్లిని వాటేసుకుని –

"అమ్మా, నేను బెంగళూరులో ఉన్నంతకాలం మీరు కూడా నాతో వుండాలి. నీ చేతివంట మళ్ళీ ఎప్పుడు తింటానో నాకే తెలీదు. అంచేత నేనిక్కడ ఉన్నన్ని రోజులు నాకు ఇష్టమైనవన్నీ వండాలి. వండి నువ్వే తినిపించాలి" అంటున్న ఆదిత్య. కళ్ళల్లో నీళ్ళు.

కొడుకు కన్నీళ్లను పమిటి చెంగుతో తుడిచింది సరోజ. ఆమెకూ ఏడుపు వస్తోంది.

'పర్లేదు. కొడుకు ఇంకా కొడుకులానే ఉన్నాడు. మాతోనే వున్నాడు... అయితే ఎన్నాళ్ళు?' అనేది ఆ తల్లిదండ్రుల్లో ఒక భయం.

*(స్వాతి మంత్లీ - డిసెంబర్ 2011)*